# పాపారాయుని దర్బార్

అంధేరా దేశంలో ఓ జనపదం. దానికో రాజు ఆయనే మహోఘాత వహించిన రంగమార్తాండ రంగధీర సాహితీ సమరాకార కాకన్నకాక, శ్రీశ్రీశ్రీ పాపారాయులుంగారు. దొంగ రుద్రాక్ష మెడలో వేసుకొని సంగిమాటలతో ముఖానికొక వెర్రినవ్వు అంటించుకొని తమ దర్బారు తీరి కూర్చున్న సుముహూర్తంలో వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన అగంతకులు తమ తమ నివేదికలు సమర్పిస్తున్నారు. తొలుతగా అంగదేశమునుండి వచ్చిన అధికారి తన కాకుల లెక్కనుబోలిన నివేదిక నివేదించాడు.

'మహాభాగా! నా పేరు కీర్తిశేషుడు నన్ను మీరు అంగదేశంలోని పురాతన గ్రంథ సేకరణకు వినియోగించారు....'

'ఔను-సుమా! మరి నీ కర్తవ్యమేమైనది?'

'నా శక్తివంచన లేకుండా పని విజయవంతంగా నిర్వహించాను. పురాతన శిలాశాసనాలు, పాతకవిలికట్టెలు, గోతాలు, ఏతాములు, చీపుర్లు, చేటలు గాడిద బరువును మోసుకొని వచ్చాను.'

'సెహబాష్ కీర్తిశేషా! నీజన్మ చరితార్థము... కాని గోతాలూ, ఏతాములూ ఎందుకు? చీపుర్లు చేటలు ఎందుకు?'

"చిత్తం మహాప్రభూ! గోతాలు మామూలు గోతాలు కావు.మహామాంత్రిక గోతాలు. ఈ గోతాలలోనే రంగధాముని కవిత్వ కళాఖండాలు బంధింపబడి వున్నాయి."

'రంగధాముడా? వాడెవడు?'

సభ మొత్తం గొల్లున నవ్వింది.

'సద్దు-సద్దు' దండనాయకులు సభను స్వాధీనంలోనికి తీసుకుంటున్నారు.

'విశ్వసాహిత్యములో నగ్రగణ్యుడైన రంగథాముని పేరే తెలియదా స్వామీ!'

'తెలుసు! తెలుసు. మరచిపోయినాను సుమా!'

సభ మళ్ళీ నవ్వింది.

'ఛా మూర్ఖులారా! నవ్వకుడు. కీర్తిశేషా! మరి ఏతాములెందుకు?'

'ఏతాములంటే మామూలు ఏతాములుకావు స్వామీ! మహాకవి పోతన్న వంటి కర్షక కవీంద్రులు వాడిన ఏతాములు. ఇక చీపుర్లు చేటలు జానపద కళా ఖండాలు.'

'సాధు-సాధు-'సభ మొత్తం హర్షధ్వానాలు తెలిపింది.

'కీర్తిశేషా! నీ జన్మ ధన్యము. ఆ ఏతామును మన సభలో అలంకరింప జేయాలి - ఒక ప్రముఖ స్థానంలో - ఎక్కడ?' మంత్రిని సలహా అడిగాడు.

మంత్రి బాగా ఆలోచించి జవాబు చెప్పాడు. 'స్వామీ! అన్నిటికన్నా ఉన్నత స్థానం తమ సింహాసనమే! అందుకని మీకు బదులుగా ఏతామును కూర్చోబెట్టుతామిక్కడ - ఏమంటారు?'

'అంతే! అంతే అదే, మన పూర్వీకులకు తగిన గౌరవం'

సభ అరుస్తున్నది.

పాపారాయులవారికి తీర్మానం నచ్చలేదు.

'మరినేనో!' బిక్కమొగంతో అడిగాడు

'రామపాదుకలవలె ఏతాము సేవ చేయవచ్చు తమరు - ఇది ఉత్తమ సాహితీపోషణ అనిపించుకుంటుంది.'

'సరే! ఆలోచిస్తాను-కీర్తిశేషా! మరి నీవు తెచ్చిన గ్రంథాలేవి?'

గ్రంథాలంటే ఒకటి రెండు కాదు ప్రభూ! బండ్లకొద్దీ గ్రంథాలు. మన సభకు వన్నె తెచ్చే గ్రంథాలు. కాని....'

'ఆఁ-కాని ఏమిటి?'

'ఆ గ్రంథాలను తమ దర్బారు చేరకముందే దగ్ధంచేశాను ప్రభూ!'

'అదేమిటి?' పాపారాయులవారు మండిపడ్డారు....

'మూఢా! సౌందర్య కమలాలు వికసింపవలసిన నా సభలో ఏమిటీ అవాచ్యపు మాటలు ...?'

కీర్తిశేషుడు భయపడుతూ చెప్పాడు 'చిత్తం ప్రభూ! నేను తెచ్చిన ప్రతి గ్రంథమూ తమవద్ద ఇంతకుముందే వున్నది. తమకడ లేని గ్రంథమే ఇక లేదని తెలిసి మీ గౌరవానికి చిహ్నంగా వాటిని తగలేశాను....'

సభ మొత్తం ఘోషనాదం చేసింది.

పాపారాయులవారు తలనూగిస్తున్నారు - గ్రంథాలు తగలేసినందుకు కాదు - చేర్చవలసిన పుస్తకమే లేని తన గ్రంథాలయపు ఘనతనుగూర్చి తలపోసి-

'అపర సరస్వతీ స్వరూపులు. పుంభావ సరస్వతులు. మీరే శారదాకేతనులు - నికేతనులు' కీర్తిశేషుడు పొగుడుతున్నాడు.

'సెహబాష్ కీర్తిశేషా! నీకు దానంగా చవిటిపట్టు అగ్రహారం ఇస్తున్నాను మరి నీవు తెచ్చినవి....'

'గోతామూ, ఏతామూ చీపుర్లూ చేటలూ మాత్రం మిగిలాయి. అవి రేపు తమకు సమర్పించుకుంటాను....' అని కీర్తిశేషుడు వెళ్ళాడు- సభ మొత్తం హర్షధ్వానాలు చేసింది.

అనంతరం వంగదేశానికేగిన కార్షాపణుడు వచ్చాడు.

'కార్షాపణా! నిన్ను నేనేడకు పంపితిని?'

'వంగదేశమునకేగి పల్లెపదములు సేకరింపుమని కోరితిరికదా ప్రభూ!'

'సేకరించితివా?'

"చిత్తం ... సేకరించితిని"

"ఏమి సేకరించితివి?"

"గొబ్బె పదములు - గుబ్బ పదములు"

"ఓహో! ఓహో" సభ తన్మయత్వంలో పడిపోయింది.

"ఇదిగో - చూడండి" సాభినయంగా ఒక పదాన్ని చూపుతున్నాడు కార్షాపణుడు - కార్షాపణుని శత్రువు పరంధాముడు లేచి "పాపారాయ మహాప్రభూ! ఇందులో నూతనత్వంలేదు. మా ఇంటిపక్క బుచ్చి ఈ పదమే పాడుతూ వుంటుంది రోజూ" అన్నాడు.-వెంటనే కార్షాపణుడు 'భూమి గుండ్రన, సృష్టియే పురాతనమైనది - ఏమి చేయగలరు?" అని వివరించాడు.

"కర్షాపణా! నీ వివరణమే నచ్చినది- ఇదిగో పద సేకరణ చంద్ర బిరుదము...."

సభ హర్షధ్వానాలు చేసింది. మళ్ళీ ఆనందంతో కార్షాపణుడు గుబ్బ పదం పాడుతూ గెంతుతున్నాడు.

"పద చంద్రా!" "పదచంద్రా!" అని ప్రేక్షకులు కేరింతలు పెడుతున్నారు.

"ఉత్తర సరిహద్దులు ప్రమాదముగా వున్నవి ప్రభూ!" గూఢచారి ప్రవేశించాడు....

"అధిక ప్రసంగము....రసభంగము... పంపు మంత్రీ, ఈ మూఢ గూఢచారిని....ఆc- కార్షాపణా! ఏది నీ పదసాహిత్యము?...."

కార్షాపణుడు శివమెత్తినట్లు గెంతుతున్నాడు- గూఢచారి చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయాడు....

అది సాహిత్యమో బూతులో, తెలియటంలేదు.

పదసాహిత్య ప్రభావంలో సభ ఓలలాడుతున్నది. అప్పుడు ప్రవేశించింది యక్షగానాలలో వేషంవేసే చంచలాక్షి చంచలాక్షితోపాటు శేషాచార్యులవారు కూడా వచ్చారు కాని శేషాచార్యులవారిని ద్వారపాలకులు గెంటివేశారు. శేషాచార్యులవారు చతుర్వేద పారంగతులు. సర్వశాస్త్ర కోవిదులు. ఒక అముద్రిత గ్రంథానికి సహాయార్థం వచ్చారు - కాని !!!

చంచలాక్షిని చూడగావే పదచంద్రులవారు కూర్చున్నారు. పాపారాయుల వారు ఎదురేగి తీసికొనివచ్చి అర్థాసనమిచ్చి గౌరవించారు.

"చంచలాక్షీ! ఎట్లున్నది నీ కళాసేవ?"

"నేను ప్రస్తుతము యక్షగాన ప్రదర్శనతోపాటు ప్రహేళిక, ప్రవల్లిక, మతల్లిక అనే ప్రక్రియలను కూడా స్వీకరించి రచన ప్రారంభించాను ప్రభూ!"

"ఓహో! ఏమి మహరాజు - ఏమి సాహిత్యపోషణ ! నట్టువలు నిఖిల విశ్వ కవయిత్రులయిపోతున్నారు!...." సభ ఆశ్చర్యపడిపోతున్నది.

"చంచలాక్షీ! ఇంతకూ నీ ప్రహేళికకు ఇతివృత్తమేమిటి?"

"ఆవు పేడా - అప్పడాలు"

సభ ఆనందతాండవం చేస్తున్నది "ఓహో! ఓహో!" అని పరవశంతో అరుస్తున్నారు.... "ఆవుపేడ" ఎంత ఉదాత్త విషయం!!! ఆవుపేడపై ప్రహేళికలు వ్రాసినవారు నభూతో నభవిష్యతి ...

"మనలనీ దినమంతా చంచలాక్షి ఆనందపెట్టాలి...." పాపారాయులవారు కోరారు .. సభ ఆశతో ఎదురుచూస్తున్నది.

"దినమే ఏమిటి ప్రభూ" అర్థనిమీలితంగా ఒక కంటినుంచి, చంచలాక్షి సమాధానమివ్వడంతో పాపారాయలవారు ఉవ్వెత్తున తారాజువ్వలాగా ఆనందంతో త్రుళ్ళిపడి "ఈ సంవత్సరపు ఉత్తమ కవయిత్రి, ఈమెయేనని ప్రకటిస్తున్నాను" అన్నారు....

సభ ఆపురుమంటూ హర్షధ్వానాలు చేస్తున్నది.

"పాపారాయులవారు ఆదర్శ ప్రభువులు... అమరకవులు ఓహో-ఓహో!!"

పాపారాయుల దర్బారులో రసజగత్తు విరిసింది, రామణీయకత నాట్యం చేస్తున్నది. వారికి నిజంగా కష్టాలు లేవు-కల్లోలాలు లేవు-సరిహద్దులు లేవు సమస్యలులేవు పాపాలులేవు, పుణ్యాలులేవు, అసలు ప్రజలేలేరు వారికండ్లకు... అటువంటి దర్బారు ప్రాంగణంలోకి సరియైన సమయంలో కేతినాయకుడు ప్రవేశించాడు....

"ఎవరు నీవు?"

"కేతనాయకుడు ప్రభూ నా పేరు"

"ఓహో! ఏమిచేశావు నీవు?"

"సర్వశాస్త్ర పారంగతుడినైన అనంతరం కామయక్షగాన గాథాగ్రంథనం చేస్తున్నాను ప్రభూ.!"

"ఎంతో గొప్పపని చేస్తున్నావయ్యా నీవు! నీ జన్మ చరితార్థం మా ఆస్థానంలో నీబోటివారికే గౌరవం లభిస్తుంది మఱి నీ ప్రధాన వృత్తి ఏమిటి?"

"తోలుబొమ్మలాటలు వ్రాయడం"

"తోలుబొమ్మలకవీ! ఏది నీ కవితా ప్రతిభను వెలార్చుకొంచెం"

"చిత్తము" అని కేతినాయకుడు గొంతెత్తి లీతువుపిట్టలా అరవడం ప్రారంభించాడు. సభ సావధానంగా వింటున్నది.

"ఓహో పాపారాయా! ఆహా సాపారాయా"

పరంధాముడు "ఏయ్ కేతినాయకా! సాపారాయా అంటే అర్థమేమిటి?" అని ప్రశ్నించాడు మధ్యలో....

"అధిక ప్రసంగమిది - పాపారాయా వచ్చింది కాబట్టి సాపా రాయా, కోపారాయా, తాపారాయా, ఛీపోరాయా అని తర్వాత అంత్యప్రాసలు వగైరాలు రావాలి. ఆమ్మాత్రం కూడా తెలియదా నీకు?" కేతినాయకుడు సమర్థించుకున్నాడు హారతి పళ్లెంలాంటి ముఖం అటూ ఇటూ ఊపుతూ.

"ఔను పాపా అన్నప్పుడు "ఛీపో" రావలసినదే" అన్నది చంచలాక్షి హుషారుగా.

తన్ను సమర్థించినందుకు పొంగిపోయి.

"నీకు నీవేసాటి ఓ చంచలాక్షి నీకిదే జోహారు రోమాంచలాక్షి!

"హూహో హూహూ హోహో హూహూ" అంటు కేతి నాయకుడు చంచలాక్షని పొడుగుతున్నాడు.

"కేతి నాయకుణ్ణి నేను పైకి తేవాలి" స్వగతంగా అన్నది చంచలాక్షి.

"నేనే వద్దామనుకుంటున్నాను" అనుకున్నాడు కేతి నాయకుడు.

"నామీద కవిత్వం - నామీద కవిత్వం" పాపారాయుడు గోలపెడుతున్నాడు. "వస్తున్నాను ప్రభూ. వస్తున్నాను"

"ఓహో పాపారాయా! ఛీ! పో! కాపారాయా
అది ఇదిలో ఇది అదిలో
ఎంత ఇదీ, ఇంత అదీ
ఛీ పో కా పారాయా...."

"అమర కవిత్వం అపూర్వ సంగీతం" ప్రేక్షకులు హర్షధ్వానాలు చేస్తున్నారు... ఇంతలో గంగూలీ ప్రవేశించాడు.

'అభివందనాలు పాపారాయా"

"వాడెవడు?"

"నా పేరు గంగూలీ - మాది మందుల వ్యాపారం".

"ఇక్కడెవరికి జబ్బులు లేవు"

"జబ్బులు కాదు డబ్బులకై వచ్చాను"

"అవెందుకు?"

"నేను సాహిత్య సేవ చేయదలచాను."

"చచ్చాం పో"

"నా సాహిత్య సేవ ప్రారంభించకముందేనా ప్రభూ...."

"అయితే నీకేమి కావాలి"

"అక్షరలక్ష విరాళం ఇప్పించండి."

"అరలక్ష ఇచ్చాం - అల్లరిపెట్టకుండా పో"

'చచ్చినవాడి పెళ్ళికి వచ్చిందే లాభం' అనుకొని "చిత్తం అంతేచాలు"నని గంగూలీ నిష్క్రమించాడు.

కేతి నాయకుని కవితా ప్రహసనం మళ్ళీ ప్రారంభమైంది.

ఇంతలో కోశాధికారి ప్రేమచంద్రుడు వచ్చి తన నివేదిక విన్పించాలని గోలపెట్టాడు.

"మూఢా! ఇది సాహిత్య సమ్మేళనం రా!"

"కాబట్టే ప్రభూ! నేను వచ్చాను. అవర భోజులైన మీ ఆస్థానంలో లెక్కలు, వ్యాపారమూ కూడా కవిత్వంగానే మారిపోయింది"

సభికులు 'సాధు' నాదాన్ని హాహాకారాలతో వెలువరించారు.

'మంచిది, వినే ఓపికలేదు. ఒకవాక్యంలో చెప్పు! నీ నివేదిక సారాంశమేమిటి?'

'అప్పులు పెరిగి రాజ్యం తాకట్టు పెట్టాము.' ఏక వాక్యనివేదిక విన్పించాడు ప్రేమ చంద్రుడు.

'ఇది పురోగమనమా? తిరోగమనమా?' స్వగతంలో ప్రశ్నించాడు పాపారాయుడు.

"నిశ్చయంగా పురోగమనమే! పితృవాక్యంకోసం రాముడు రాజ్యం కోల్పోయాడు - సత్యవాక్యం కోసం హరిశ్చంద్రుడు - కాని పాపారాయుడో సాహిత్యంకోసం ... సరస్వతికోసం" సభలో ఒక మూలనుండి కొప్పిరం జింగడు వ్యాఖ్యానించాడు. సభ 'వహ్వా - వహ్వా అద్భుతమైన వ్యాఖ్యానం' అని కేరింతలు పెడుతున్నది.

రాజు పరవశుడై 'ఎవరునువ్వు' అని ప్రశ్నించాడు.

'ఆగంతకుణ్ణి ప్రభూ! తమ ఆదరాన్ని కోరి వచ్చాను' అన్నాడు కొప్పిరం జింగడు.

'మెచ్చాము ఏంకావాలి నీకు?'

'చచ్చాక నా జన్మ దినాలు చేస్తారో లేదో బ్రతికి వుండగానే ఆ ముచ్చట జరిపించండి.'

'....పిస్తాము'

'అంతేకాదు- నా గండభేరుండ కావ్యాన్ని తాము అంకితం తీసుకోవాలి.'

'....కుంటాము! మన రాజధానిలోని సన్మానాల ముఠారాయుళ్ళకు గుత్త హక్కులు ఇచ్చి, చేయమంటాను'

"సంతోషం.మరొక్క కోరిక, నాతోబాటు నా కులంవాడు మా మండలంవాడైన అకవి బిరుదాంకిత అప్పలస్వామికి కూడ...." ఏదో కోరబోతుండగా.

'కోరికలను జయించాలి నాయనా !'

అంటూ ప్రవేశించాడు దిగంబర గురువు మిఠాయి నములుతూ.

ముఖాన రూపాయంత బొట్టు - చేతిలో మంత్రదండం !

'రాజుల వారికీ ఆశీర్వాదం'

'శుభాభి వందనం మహర్షీ ! సమయానికి వచ్చారు. రాజ్యం తాకట్టు పెట్టాము. ఎట్లా మా భవిష్యత్తు ?'

'అమాయకుడా ! జనాన్ని హత్యలతో, భ్రూణహత్యలతో: ఆత్మహత్యలతో స్తంభింప చేయవయ్యా ! కాగా, మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అని వినలేదా ? పెద్ద రాజ్యం పెద్ద బాధ్యత - అన్ని దానములకన్నా భూదానము మిన్న '

'అదేదో మీరే చేయించండి'

'నేను నీకు గురువైంది ఎందుకు ? అందుకే !! ఈ మహా దాన కార్యక్రమానికై నాకూ నా శిష్యులకూ వార్షికాలు ఉద్యోగాలూ ఏర్పాటు చేయాలి- అంతేకాదు - కవులందరూ మన ఆశయాలనూ ఆదర్శాలనూ ప్రచారం చేస్తూ పాటలూ - పద్యాలూ గీతాలు వచన గేయాలూ వ్రాయాలి' జర్దాకిల్లీ నోట్లో పెట్టుకున్నాడు.

"ఎవరైనా 'వ్రాయను' అంటే ?"

'వాడి ఖర్మ ! వాడిని మన ప్రశాశికాబద్ధ ప్రగతిలో నిషేధిస్తాము. కవి సమ్మేళనాలకు ఆహ్వానించము. శాలువాలు కప్పము. దేశ బహిష్కారం శిక్ష.'

'సెభాష్ !' పాపారాయుడు ఊగిపోతున్నాడు.

పిగ్మీలుడు, అంగుష్టుడు, వాలఖిల్యుడూ, కేతిగాడు - బంగారక్క ప్రభువులు కోరిన కవితలు టన్నులకొద్దీ ఉత్పత్తి చేస్తామని మాట ఇచ్చారు కడుపునిండా తిండి తిని ఆకలి పాటలు కూడా వ్రాసి ఇవ్వగలమని వాగ్దానం చేశారు.

'సరిలేరు నీకెవ్వరూ ! ఓ పాపారాయా !

సరిలేరు నీకెవ్వరూ -'

మధ్య మధ్య మద్యోన్మత్త మదోన్మాత వందిమాగధుల కైవారాలు,

పాపారాయడు ఉష్ట్రపక్షిలా ముఖం పెట్టి ఊహాలోకాల్లో జీవిస్తున్నాడు. 'వహ్వా ! వహ్వా !' వైతాళికుల ప్రశంసలు.

దేశంలో జంతువులు అన్నానికి బదులు డబ్బు తినడం మొదలు పెట్టాయి.

హేతువాదులూ బూతువాదులూ నాస్తికత్వాన్ని ప్రబోధిస్తున్నారు. హత్యలు ఉద్యమంగా సాగుతున్నాయి ! దేశం గొడ్డుబోతున్నది . జ్ఞానపథాలు కావలసిన జానపదాలూ యక్షగానాలు హింసనూ అశ్లీలాన్ని బోధిస్తున్నాయి. ఈ దుర్మార్గులను శిక్షించండి' అంటూ శేషాచారి పంపిన ఉత్తరం చదివి పాపారాయడు మండిపడ్డాడు.

'ఈ సంప్రదాయకవి చాదస్తానికి దేశ బహిష్కారమే శిక్ష . ముందు చెరసాలలో బంధించండి"

'ఖాళీలు లేవు ప్రభూ !'

'అయితే దొంగలను, హంతకులను, దేశద్రోహులను కొందరిని వదిలి చెరసాలలో ఖాళీ సృష్టించండి'

'వహ్వా ! వహ్వా ! తెలివంటే పాపారాయల వారిదే తెలివి'

జనఘోష ! !

పాపారాయని దర్బారు అమావాస్య అర్ధరాత్రిలా వెలిగిపోతున్నది ! !

వినేందుకు ప్రజలు రాకపోతే చెట్లకూ జంతువులకూ పాపారాయని ప్రచార గీతాలు వినిపిస్తున్నారు ఆస్థాన కవులు ! !